# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పౌర సేవకుల నియామకంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు నిజాయితీ, సమగ్రతలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- ❖ యోగా.. ప్రపంచానికి ఆరోగ్యం, సమతుల్యత, సామరస్య మార్గాలను చూపిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.
- ❖ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం పొందిన బిల్లులు.. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కీలకమైనవని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు.
- ❖ దేశవ్యాప్తంగా పటిష్టమైన ఓడరేవు భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయవలసి ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు.
- ❖ భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య చివరి టీ-20 క్రికెట్ మ్యాచ్ అహ్మదాబాద్ వేదికగా జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ (PSC) చైర్ పర్సన్‌ల రెండు రోజుల జాతీయ సమావేశాన్ని హైదరాబాద్‌లో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ… పౌర సేవకులను నియమించేటప్పుడు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు నిజాయితీ, సమగ్రతలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. UPSC దేశంలో అత్యంత విశ్వసనీయ ప్రభుత్వ సంస్థలలో ఒకటి అని వ్యాఖ్యానించారు. విశ్వసనీయతకు అధిక ప్రాధాన్యతనిస్తూ.. ఎప్పటికప్పుడు పుట్టుకొచ్చే సవాళ్లను ఎదుర్కొనేందుకు UPSC, రాష్ట్ర PSCలు సిద్ధం కావాలని రాష్ట్రపతి సూచిస్తూ…

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచానికి యోగా.. ఆరోగ్యం, సమతుల్యత, సామరస్య మార్గాలను చూపిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) గ్లోబల్ సమ్మిట్ ఆన్ ట్రెడిషనల్ మెడిసిన్ సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. సమతుల్యతను పునరుద్ధరించడం ప్రపంచానికి అత్యవసరమని ఉద్ఘాటించారు. భారతదేశ ప్రయత్నాలతో పాటు 175కి పైగా దేశాల సహకారంతో ఐక్యరాజ్యసమితి జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందని చెప్పారు. గడచిన 11 సంవత్సరాల కాలంలో యోగా.. ప్రపంచంలోని ప్రతి మూలకు చేరుకుందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ సందర్భంగా... ప్రధానమంత్రి WHO డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్‌తో కలిసి ఢిల్లీలో కొత్త WHO-ఆగ్నేయాసియా ప్రాంతీయ కార్యాలయ సముదాయాన్ని ప్రారంభించారు. యోగాలో శిక్షణపై WHO సాంకేతిక నివేదికను, "From Roots to Global Reach : 11 Years of Transformation in Ayush" అనే పుస్తకాన్ని నరేంద్రమోదీ విడుదల చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా పటిష్టమైన ఓడరేవు భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయవలసి ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు. నౌకలు, ఓడరేవుల భద్రత లక్ష్యంగా ప్రత్యేకంగా బ్యూరో ఆఫ్ పోర్ట్ సెక్యూరిటీ (BoPS) ఏర్పాటు చేసే అంశంపై న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. వాణిజ్య సామర్థ్యం, సవాళ్ళు, ప్రదేశం మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకుని రిస్క్ ఆధారిత పద్ధతిలో భద్రతా చర్యలు అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. కొత్తగా ప్రకటించిన మర్చంట్ షిప్పింగ్ చట్టం-2025 లోని సెక్షన్ 13 ప్రకారం బ్యూరో ఆఫ్ పోర్ట్ సెక్యూరిటీని ఒక చట్టబద్ధమైన సంస్థగా ఏర్పాటు చేస్తామని మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఈరోజు ముగిశాయి. ఈ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ.. 111 శాతం ఉత్పాదకతతో మొత్తం 15 సభలు జరిగాయన్నారు. సభ సజావుగా సాగడానికి సహకరించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభ మొత్తం 92 గంటల పాటు పని చేసి, 121 శాతం ఉత్పాదకతను నమోదు చేసిందని చైర్మన్, ఉప రాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ తెలియజేశారు. ఈ సమావేశాల్లో 59 ప్రైవేట్ సభ్యుల బిల్లులు ప్రవేశపెట్టబడ్డాయని, చారిత్రక, ప్రజాస్వామ్య ప్రాముఖ్యత కలిగిన అంశాలపై విలువైన చర్చలు జరిగాయని పేర్కొన్నారు. జాతీయ గేయం వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో 82 మంది సభ్యులు పాల్గొన్నారని చైర్మన్ వెల్లడించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం పొందిన బిల్లులు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. శీతాకాల సమావేశాలు ముగిసిన సందర్భంగా న్యూఢిల్లీలో ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ.. ఆమోదించబడిన బిల్లులు కోట్లాది మంది ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు దోహదపడతాయన్నారు. ఎన్నికల సంస్కరణలపై పార్లమెంట్‌లో మొదటిసారిగా ప్రత్యేక చర్చ జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయని, అయితే చర్చల తర్వాత ప్రతి అంశంపై స్పష్టత లభించిందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు పశ్చిమ బెంగాల్ లో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. నాడియా జిల్లా రాణాఘాట్‌లో జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి, అనంతరం అక్కడ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సుమారు 3 వేల 200 కోట్ల రూపాయల విలువైన ఈ జాతీయ రహదారి ప్రాజెక్టులు కోల్‌కతా, సిలిగురి మధ్య కీలకమైన అనుసంధానంగా పని చేస్తాయి. పశ్చిమ బెంగాల్ పర్యటన అనంతరం ప్రధానమంత్రి అస్సాంలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆయన.. లోకప్రియ గోపీనాథ్ బార్డోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయం నూతన టెర్మినల్ భవనాన్ని ప్రారంభిస్తారు. ఆ తరువాత రోజున గువహతిలోని బోరాగావ్‌లోని స్వాహిద్ స్మారక్ క్షేత్రంలో చారిత్రాత్మక అస్సాం ఉద్యమంలో అమరవీరులకు ప్రధానమంత్రి నివాళులర్పిస్తారు. అనంతరం అస్సాం వ్యాలీ ఫర్టిలైజర్ అండ్ కెమికల్ కంపెనీ లిమిటెడ్ అమ్మోనియా-యూరియా ప్రాజెక్ట్ కు నరేంద్ర మోదీ భూమి పూజ నిర్వహిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

నెదర్లాండ్స్ తో సంబంధాలను భారత్ విలువైనవిగా పరిగణిస్తుందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. నెదర్లాండ్స్ విదేశాంగ మంత్రి డేవిడ్ వాన్ వీల్‌తో న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన సమావేశంలో ఆయన.. ఇరు దేశాల మధ్య గత కొన్ని నెలలుగా అనేక కీలక ఒప్పందాలు జరిగాయని చెప్పారు. రెండు దేశాల మధ్య సహకారానికి సంబంధించి మరిన్ని అంశాలు చేరాయన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై యూరోపియన్ యూనియన్ (ఈయు)తో జరుగుతున్న చర్చలు నిర్ణయాత్మక దశకి చేరుతున్న నేపథ్యంలో భారత్.. ఈయూలో కీలకంగా ఉన్న నెదర్లాండ్స్ మద్దతును కూడా పరిగణనలోకి తీసుకుంటుందని వివరించారు. వ్యవసాయం, ఆరోగ్యం, సైన్స్, టెక్నాలజీ, షిప్పింగ్ వంటి రంగాలలో ఇరు దేశాల మధ్య బలమైన సహకారం ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐదు మ్యాచ్ ల టీ-20 సిరీస్ లో భాగంగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య చివరి టీ-20 క్రికెట్ మ్యాచ్ అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరుగుతోంది. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 14 ఓవర్లకు 3 వికెట్లు నష్టపోయి 158 పరుగులు చేసింది. భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ 34, సంజు శామ్ సన్ 37 పరుగులకు అవుట్ అవ్వగా.. తిలక్ వర్మ, హార్ధిక్ పాండ్యా క్రీజ్‌లో కొనసాగుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

శిలాజ ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం భారతదేశ స్వావలంబనను బలోపేతం చేస్తుందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... భవిష్యత్‌లో ఇంధన స్వాతంత్ర్యం ఒక ఎంపిక కాదని, ఆర్థిక, వ్యూహాత్మక, భౌగోళిక, రాజకీయ అవసరమని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =